

• బాలికల వసతి గృహం

జేఎన్టీయూపై శీతకన్ను

ఎక్కడికక్కడే నిలిచిన నిర్మాణాలు

- ఏళ్లుగా సాగుతున్న కళాశాల పనులు
- నిధుల విడుదలపై వర్సిటీ మీనమేషాలు
- అక్టోబరు కల్లా వసతి అన్న వీసీ ప్రకటనకే పరిమితం
- రూ.44.2 కోట్ల ప్రతిపాదనలపై పాలకమండలి నిర్లక్ష్యం

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- అక్టోబరు కల్లా వసతి గృహ భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని జేఎన్టీయూ వీసీ గతంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- జేఎన్టీయూ కళాశాల భవన నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి.
- క్రీడా ప్రాంగణ భవనాల నిర్మాణం సగంలోనే ఉంది.
- పరిపాలన, ప్రయోగశాలల నిర్మాణాలను ఆరేళ్లుగా సాగదీస్తున్నారు.
- కళాశాల తరగతులకు సంబంధించి మూడు ఫ్లోర్లలో రెండు ఫ్లోర్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మరో ఫ్లోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్



పూర్తికాని కళాశాల భవనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రభుత్వ రంగంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరసరావుపేటలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటైంది. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చిందని.. పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో కళాశాల ఏర్పాటుతో పల్నాడు జిల్లా అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారు. అయితే ఇక్కడ పేరుకు కళాశాల ఏర్పాటు చేసినా జేఎన్టీయూ స్థాయిలో నిర్మాణాలు, సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా నిర్మాణ పనులు సాగుతుండటంతో అసలు ఎప్పటికి కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందో తెలియక.. ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కేటాయింపులో పాలక మండలి నిర్లక్ష్యం వందలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలపై వర్సిటీ పెద్దలు శీతకన్ను ప్రదర్శిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నిధుల లేమితో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణాలకు సంబంధించి కమిటీలు రూ.44.2 కోట్ల (మిగతా 6వ పేజీలో)


అధికారుల మరణ శాసనం

- అన్నదాత సుఖీభవతో వెలుగులోకి
- నెపాన్ని ఒకరిపై ఒకరు వేసుకుంటున్న శాఖలు
- అన్నదాత నగదు జమపై గ్రీవెన్స్‌కు 4731 అర్జీలు

గడువు ముగిసినా తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

అధికారుల మరణశాసనం ఇది. నిక్షేపంగా బతికి బాగున్న వారిని చంపేసిన వైనమిది. తమను అధికారులు చంపేసి రికార్డుల్లో నమోదు చేశారన్న విషయం సంబంధిత వ్యక్తులకు కూడా తెలియకపోవడం విశేషం. తీరా అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాకపోవడంతో బాధితులకు అసలు విషయం బోధపడలేదు. మరణించినట్లుగా రికార్డుల్లో ఉండటంతో అన్నదాత సుఖీభవ సొమ్ము చాలా మందికి జమ కాలేదు. బతికుండగానే చనిపోయిన జాబితాలో ఎక్కిన బాధితుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అలా



Check Status

Status Found

Name	అంబటి భారతీ దేవి
District	బాపట్ల
Mandal	యద్దనపూడి
Village	గన్నవరం
Status	Ineligible
Remarks	Person Death, Recorded in CRS Portal

*Disclaimer: This information is fetched live from the Andhra Pradesh Annadathasukhibhava portal. We do not store or share any details. Always verify with the official website.

Also Read: Annadata Sukhibhava Beneficiary List

ఎలా జరిగిందని రెవెన్యూ అధికారులను అడిగితే తెలియదని సమాధానం దాటేస్తున్నారు. ఇదేందని వ్యవసాయ శాఖని నిలదీస్తే అసలు తమకు సంబంధమే లేదంటున్నారు. తప్పు జరిగిన తర్వాత కూడా గ్రీవెన్స్‌లో బాధితులు దరఖాస్తు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది.

నాకు న్యాయం చేయాలి



నేను నిక్షేపంగా ఉన్నాను. అయినా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు తప్పు సరిచేస్తారా అంటే అదీ లేదు. ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

- అంబటి భారతీ దేవి, బాధితురాలు

నిక్షేపంలా ఉన్న భారతీదేవి..

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన అంబటి భారతీదేవికి వ్యవసాయ భూమి ఉంది. అన్నదాత సుఖీభవ సొమ్ము ఆమెకు జమ కాలేదు. అధికారులను సంప్రస్తే మృతి చెందినట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు తేలింది. ఇదెలా జరిగిందని వీఆర్వోను ప్రశ్నిస్తే తెలియదన్నారు. జీవించి ఉన్నట్లుగా సర్టిఫికెట్ తీసుకుని తహసీల్దారు, వ్యవసాయ అధికారికి భారతీదేవి చూపించినా (మిగతా 6వ పేజీలో)

బార్లు మాకొద్దు.. బాబోయ్



- అరకొరగానే దరఖాస్తులు
- గడువు పెంచినా కొరవడిన స్పందన
- ఎక్సైజ్ అధికారుల ప్రయత్నాలు విఫలం
- మూడో వంతు బార్లకు అందని దరఖాస్తులు
- బాపట్ల జిల్లాలో నాలుగు బార్లకే పూర్తిస్థాయిలో..
- గుంటూరు జిల్లాలో 35, పల్నాడు జిల్లాలో 16 అర్హత
- నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన బార్లకు నేడు లాటరీ

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బార్లు అంటే మద్యం వ్యాపారులు భయపడు తున్నారు. గడువు పొడిగించినా బార్లకు దర ఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే తొలుత ఇచ్చిన గడువు ఈ నెల 26 కాగా స్పందన మరీ పేలవంగా ఉండడంతో శుక్రవారం వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమం లో ఎక్సైజ్ అధికారులు ఎక్కడికక్కడ వ్యాపా రులతో ఎలాగైనా బార్లకు దరఖాస్తులు చేయించా లని పలు ప్రయత్నాలు చేశారు. అయినా వ్యాపారులు ముందుకు రాలేదు. శుక్రవారం రాత్రి గడువు ముగిసేప్పటికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మూడో వంతు బార్లకు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు రాలే దు. లాటరీ ప్రక్రియ జరగాలంటే ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు రావాలనే నిబంధనను పెట్టింది. మూడు జిల్లాల్లో మొత్తం 178 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా గడువు ముగిసేప్పటికి 55 బార్లకు మాత్రమే పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుంతో పాటు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు కూడా భారమవుతుందని, వైన్ షాపులకు పర్మిట్ రూములతో లాభాలు కష్టమని వ్యాపారులు బార్ల వ్యాపారానికి మొగ్గు చూపలేదని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి దరఖాస్తు సమయంలోనే (మిగతా 6వ పేజీలో)



గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళగిరి మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడ్ని శుక్రవారం రూ.2 కోట్ల 35 లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. - మంగళగిరి

ఎంటీఎంసీలో.. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

రూ.6.30 కోట్లతో మంగళగిరిలో వంద, తాడేపల్లిలో నలభై దుకాణాలు



వెండింగ్ మార్కెట్ నమూనా

మంగళగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ) పరిధిలో కొత్తగా స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 140 షాపులను రూ.6.30 కోట్లతో ఏర్పాటుచేయనున్నట్లు మెప్మా అధికారులు తెలిపారు. పట్టణ వీధి విక్రేతలకు సాధికారతను కల్పించేందుకు దీనదయాళ్ అంత్యోదయ యోజన జాతీయ పట్టణ జీవనోపాధి కింద మెప్మా ఈ సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. తాడేపల్లిలో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ రోడ్డు మార్జిన్ వెంబడి 40, మంగళగిరిలో వంద చొప్పున షాపులను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి మంగళగిరిలోని నిడమర్రు రోడ్డు వెంబడి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉందని సమాచారం. అయితే ఈ మార్గంలో రైల్వే ఫ్లైఓవర్, ఆరువరుసల రోడ్డు నిర్మాణ పనులను సీఆర్‌డీఏ చేపట్టనుంది. షాపులను స్వయం సహాయక గ్రూపుల వారికే కేటాయిస్తున్నా మరీ దివ్యాంగులు, అణగారిన వర్గాల వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

డ్రగ్స్ బానిసలకు కౌన్సెలింగ్

ఎన్‌సీఓఆర్‌డీ సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల బానిసలకు డీ-ఎడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల సమన్వయ కమిటీ(ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, జిల్లా జైలులోను డీ-ఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ సమాచారం అందించడానికి ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబరు ప్రచార బోర్డులను విద్యా సంస్థలు, ముఖ్యకూడళ్లు, వలస కార్మికుల నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అనార్థాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా వారధి, పల్లె నిద్ర, ఆపరేషన్ నషాముక్త్ భారత్, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గత నెల రోజులుగా 8 ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేసి 53 మందిని అరెస్టు చేశామన్నారు. విద్యా సంస్థల్లోని ఈగల్ క్లబ్ ద్వారా పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, విభిన్నప్రతిభావంతుల శాఖ ఇన్చార్జి ఏడీ దుర్గాబాయి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ ఆర్ఐవో సునీత, డీవీఈఓ వెంకటేశ్వరరెడ్డి, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయ ఏడీ లక్ష్మణ్, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్, పీడీలు ప్రసూన, విజయలక్ష్మి, సాంఘీక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళి, నగరపాలక సంస్థ డీసీ వెంకటకృష్ణయ్య, సైకలాజిస్ట్ నాగజ్యోతి, శ్రీనివాసులు ఈగల్ సెల్ ఎస్ఐ సునీల్ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల కట్టడిపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఎట్టకేలకు భూసేకరణకు అనుమతి

- పట్టాలెక్కనున్న గుంటూరు ఛానల్ పొడిగింపు
- రెండు రోజుల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చొరవతో పనులు వేగవంతం

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన భూసేకరణ చేసేందుకు అన్ని అనుమతులు లభించాయి. దాంతో గుంటూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారులు రెండు రోజుల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. రెవెన్యూ అధికారులు 60 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరించి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని ప్రాజెక్టుకు అవసరమైన పరిపాలన అనుమతులను ఒక్కొక్కటిగా ఇప్పిస్తున్నారు. దీంతో అధికారుల పని సులువుగా మారింది. నాలుగు దశల్లో విడుదల కావాల్సిన నిధుల్లో తొలి దశ కింద రూ.30.5 కోట్లు ఇప్పటికే జిల్లా ఖజానాకు చేరాయి. గుంటూరు జిల్లాలోని మూడు మండలాల్లో(వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు)ని 11 గ్రామాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ పనులు జరగనున్నది. ఇందులో విభజిత గుంటూరు జిల్లాలోని 7 గ్రామాల్లో 201.149 ఎకరాల భూసేకరణ నిమిత్తం ప్రస్తుతం పీఎన్ జారీ చేశారు. మిగిలిన నాలుగు గ్రామాలకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంది. భూసేకరణకు రూ.100 కోట్లను విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుతో పాటు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రాజెక్టుకు రూ.75.12 కోట్లు మంజూరు కాగా తొలి దశలో రూ.30.5 కోట్లు, రెండో దశలో రూ.12.9 కోట్లు, మూడో దశలో రూ.18.33 కోట్లు, చివరి విడతలో రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని పెమ్మసాని తెలిపారు.

నాడు నోటిఫికేషన్‌కే పరిమితం

వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం రైతులు రోడ్డెక్కి నిరవధికంగా 40 రోజులకు పైగా ధర్నా చేశారు. రాస్తారోకో, జిల్లా బంద్ ద్వారా నిరసనలు తెలిపారు. అయినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. ఎన్నికలకు కొన్ని నెలల ముందు అప్పటి సీఎం జగన్ తన సొంత పత్రికకు మేలు చేసుకునేందుకు ప్రాథమిక నోటిఫికేషన్లను జారీ చేయించి బిల్లులు కూడా చెల్లింపులు చేసి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల రూ.లక్షలు ఖజానాకు నష్టం వాటిల్లగా రైతులకు ఒనగూరిందేమీ లేదు.

ఏషియన్ షూటింగ్ పోటీల్లో మెరిసిన ముకేష్



పతకాలతో ముకేష్

గుంటూరు(క్రీడలు) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కజకిస్థాన్‌లోని షెమ్కెంట్ నగరంలో శుక్రవారం ముగిసిన ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు కు చెందిన నేలవల్లి ముకేష్ మూడు బృంద బంగారు పతకాలతో పాటు ఒక వ్యక్తిగత కాంస్య పతకం సాధించాడు. జూనియర్ విభాగంలో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో తన సహచరులతో కలిసి మూడు బంగారు పతకాలు సాధించాడు. టోర్నీ చివరి రోజైన శుక్రవారం 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యంతో పాటు టీమ్ విభాగంలో సూరజ్ శర్మ, అభినవ్ చౌదరితో కలిసి మరో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా ముకేష్‌ను కాస్త రైఫిల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నలలిత్, రాజ్ కుమార్ కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరి కిషోర్ అభినందించారు.

టీడీపీ నేత కొల్లి లక్ష్మయ్య హఠాన్మరణం


కొల్లి లక్ష్మయ్య చౌదరి

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి లక్ష్మయ్య చౌదరి (60) హఠాన్మరణం చెందారు. అనారోగ్య కారణాల రీత్యా గత కొంత కాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా వుంటున్నారు. గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన లక్ష్మయ్య చౌదరిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. లక్ష్మయ్య చౌదరి నవులూరు గ్రామ సర్పంచ్‌గా, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా, ఎర్రబాలెం ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావుకు సన్నిహితంగా వుంటూ మంగళగిరి నియోజకవర్గ టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్మయ్య చౌదరి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అధికారుల.. మరణ శాసనం

(5వ పేజీ తరువాయి)

ఆమెకు ప్రయోజనం దక్కలేదు. భారతీదేవిలా చాలామంది వృద్ధులను మృతుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు బాధితులు ముందే మేల్కొని సరి చేయించుకున్నారు. చాలామందికి విషయం తెలియక ఆలస్యం గా అధికారులను సంప్రదిస్తున్నారు. ఇలా మృతి చెందినట్లు చూపించిన వారి సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు వాపోతున్నారు.

గడువు ముగిసినా...

అన్నదాత సుఖీభవ పథకం అమలులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి వినతుల స్వీకరణకు ఈ నెల 20 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 967, పల్నాడు జిల్లాలో 2145, బాపట్ల జిల్లాలో 1617 మంది అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువ శాతం మండల వ్యవసాయ అధికారులు క్లియర్ చేశారు. పల్నాడు జిల్లాలో 1952, గుంటూరు జిల్లాలో 918, బాపట్ల జిల్లాలో 1310 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ లాగిన్‌కి వెళ్లిన అర్జీలలో చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో తహసీల్దారు లాగిన్‌లోకి 56 అర్జీలు వెళ్లగా కేవలం 15 మాత్రమే పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 19 అర్జీల్లో 3, బాపట్ల జిల్లాలో 46 అర్జీల్లో 23 మాత్రమే తహసీల్దార్లు పరిష్కరించినట్లు సమాచారం.

ముగిసిన మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


చంటి బిడ్డతో హాజరైన అభ్యర్థి


ఏసీ కళాశాలలో హాజరైన అభ్యర్థులు


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గుంటూరు (విద్య) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ముగిసింది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు పది క్యాడర్లలో 1,650 పోస్టులకు గాను గురువారం 930 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కాగా శుక్రవారం 718 మందికి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు అధికారులు తెలిపారు. 36 మంది దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక సర్టిఫికెట్లు, సామర్థ్య పరిశీలన నిర్వహించారు.

ఒంగోలు జాతి పశుసంపదను సంరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి పశు సంపదను సంరక్షించు కోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడులో జాతీయ స్థాయి నందమూరి తారక రామారావు మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బండ లాడుగు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. రైతులు పంటలతో పాటు పశు పోషణ కూడా చేయాలన్నారు. పశుపోషణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తుందన్నారు. నియోజకవర్గ జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నక్కల అగస్టియన్, కల్లూరి శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి, గింజుపల్లి శివ రామప్రసాద్, పమిడి శ్రీనివాసరావు, కాకాని సురేష్ బాబు, తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, మలినేని పెరుమాళ్ల పాల్గొన్నారు.

సత్తా చాటిన పల్నాడు ఎడ్ల జత

ఒంగోలు జాతి ఎడ్ల బండలాడుగు పోటీలు.. తొలి రోజు పాల పళ్ల విభాగంలో హోరా హోరీగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుంచి 22 జతల ఎడ్లు బరిలో నిలిచాయి. పల్నాడు జిల్లా కావురు లింగంగుంట గ్రామానికి చెందిన మైలా త్రివేణి ఎడ్ల జత 3,900 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం నంగేగడ్డ, నాగాయలంక గ్రామాలకు చెందిన ముమ్మా ప్రభు కుమారి, సంకా పవన్‌ల ఎడ్ల జతలు 3779.7 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం, పడమర గంగవరం గ్రామానికి చెందిన బంకా గురవారెడ్డి ఎడ్ల జత 3614.4 అడుగుల దూరం తృతీయ స్థానంలో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామానికి చెందిన పయ్యావుల నాగేశ్వరరావు ఎడ్ల జత నాలుగవ స్థానంలో, గుంటూరు జిల్లా పిరంగిపురం మండలం, కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎద్దు, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, తోటరావులపాడు గ్రామానికి చెందిన కోటి రాజ్యం ఎద్దు జత ఐదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను ప్రదానం చేశారు.

డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించాలి

● మార్క్ ఫెడ్ ఎండీకి ఛైర్మన్ హరిబాబు విజ్ఞప్తి


మార్క్‌ఫెడ్ ఎండి మంజీర్ జిలానికి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ హరిబాబు, బీఎం

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించి అండగా నిలవాలని ఛైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు మార్క్ ఫెడ్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలాని సమూన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజధానిలో మార్క్ ఫెడ్ ఎండీని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హరిబాబు నాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు మేలు చేసేందుకు గుంటూరు జిల్లా డీసీఎంఎస్ సంస్థకు ఎక్కువ మొత్తంలో యూరియా, ఎరువులను పంపిణీ చేసేందుకు సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు కేంద్రంలోని ఉన్నతాధికారులతో నిరంతరం చర్చిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన గుంటూరు జిల్లాకు ఎరువులను కేటాయించాలని అభ్యర్థించిన వెంటనే మంచి హృదయంతో స్పందించిన ఏపీ మార్క్ ఫెడ్ ఎండీకి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్


చింతా మోహన్

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని, దేశానికి ఇది మంచి పరిణామం కాదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను దెబ్బ కొట్టాలని కుట్రతో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిసి ఈ బిల్లును రూపొందించారని మండిపడ్డారు. కమ్యూనిస్టులు ప్రతిరోజూ ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తుంటారని, 30 రోజులు జైలులో పెడితే చట్టసభలకు ప్రాతినిత్యం కోల్పోవాలా అని ప్రశ్నించారు. దేశంలో పది మంది ముఖ్యమంత్రులపై కేసులున్నాయని ఎన్నికల అఫిడవిట్‌లలో ఉన్నాయన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మీపై వైసీపీ వ్యక్తిగత విమర్శలు హేయమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఎక్కడ సంతకాలు పెట్టమంటే, అక్కడ పెట్టి శ్రీలక్ష్మి జైలుకు పోయారని గుర్తుచేశారు.

బార్లు..మాకొద్దు బాబోయ్

(5వ పేజీ తరువాయి)

రూ.5,10,000 చెల్లించాల్సి ఉండడం వెనకడుగుకు కారణంగా ఉంది. తొలుత ఇచ్చిన గడువు పెంచడంతో పాటు, ఆశావహులతో సమావేశాలు, ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారితో దరఖాస్తుల వేయమనే సంప్రదింపులు ఇలా అన్ని వైపుల నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించినా గడువు ముగిసే సమయానికి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం కలెక్టరేట్ వేదికగా బార్ల లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తు దారులంతా ఉదయం 8 గంటలకే ఆయా కలెక్టరేట్లకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వాటి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందున్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

● బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నాలుగు బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలో ఓ బార్‌కు 5, చీరాలలో ఓ బార్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. రేపల్లె, బాపట్లలో గీత కార్మికులకు బార్లు కేటాయించగా రేపల్లెలోని బార్‌కు లాటరీ తీయడానికి కావాల్సిన దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో నాలుగు బార్లు మాత్రమే లాటరీకి అర్హత సాధించాయి.

● గుంటూరు జిల్లాలో 110 బార్లకు గడువు ముగిస్పేటికి 48 దరఖాస్తులు వచ్చాయి. 35 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వీటికి మాత్రమే లాటరీ నిర్వహణకు అర్హత సాధించాయి. జిల్లాలో గౌడ సంఘానికి పది బార్లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. కేటాయించిన పది బార్లకు లాటరీ అర్హత పొందాయి.

● పల్నాడు జిల్లాలో 49 బార్లకు 65 దరఖాస్తులు వచ్చాయి. అందులో కేవలం 16 బార్లకు మాత్రమే లాటరీ నిర్వహించే అర్హత ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ సంఘానికి ఐదు బార్ల కేటాయించగా, 22 దరఖాస్తులు వచ్చాయి. ఐదు బార్లు లాటరీ నిర్వహించేందుకు అర్హత పొందాయి.

జేఎన్టీయూపై శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

కేటాయింపునకు ఆమోదం తెలిపాయి. అయితే వర్సిటీ పాలక మండలి ఆ నిధుల విడుదలపై కనికరం చూపడంలేదు. బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహాల పనుల పూర్తికి, 500 మీటర్ల పొడవును ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.11.20 కోట్లు విడుదల చేస్తేనే వసతిగృహాల పనులు ముందుకు సాగుతాయి. వెంటనే నిధులు విడుదల చేస్తే కనీసం రెండు మూడు నెలల్లో వసతిగృహాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై నేటి వరకు వర్సిటీ నిర్ణయం తీసుకోలేదు.

అరకొర వసతులతోనే నిర్వహణ

ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన జేఎన్టీయూ కళాశాలలో అరకొర వసతులతోనే నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా కేవలం తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం జరగలేదు. రూ.33 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే కళాశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించి పాలక మండలి ఆమోదం తెలిపి ఏడాది అయినా నిధులు విడుదల కాలేదు. వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన కళాశాల కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి సాధిస్తుందని, వసతులు సమకూరుతాయన్న విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. కనీసం వసతి గృహాలను పూర్తి చేసి వినియోగం లోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

దూరవిద్యలో.. పీజీ ప్రవేశాలకు ఏఎన్‌యూ ఆహ్వానం

● 23 పీజీ కోర్సులకు యూజీసీ అనుమతి
● సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీసీ గంగాధరరావు, కళాశాల ప్రతినిధులు

ఏఎన్‌యూ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం (ఏఎన్ యూ) సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూజీసీ, డెబ్(డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) 23 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. కోర్సులు, కాల వ్యవధి, విద్యా అర్హతలు, ఫీజులు తదితర వివరాలకు 0863-2346222, 98484 77441 నంబర్లను సంప్రదించాలని సీడీఈ డైరెక్టర్ తెలిపారు.

21న ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు-2025 షెడ్యూల్ విడుదలైంది. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులుగా గుర్తిస్తారు. సెప్టెంబర్ 21న ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఐసెట్‌లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు నేరుగా ప్రవేశం పొందవచ్చు.

కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాలతో అవగాహన ఒప్పందం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - విజయవాడ, కాకినాడలోని కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు సమక్షంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, కేఐఎఫ్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం పత్రంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా వర్సిటీలో ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ రంగాల్లో నాలుగు సంవత్సరాల బీఎస్సీ ఆనర్స్‌తో పాటు ఏడాది కాల పరిమితితో కూడిన డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించనున్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, కేఐఎఫ్టీ విద్యా సంస్థల చైర్మన్ కె.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, రాజామాస్టారు

సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రతి గుండెకు భరోసా!

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధితో ప్రతి గుండెకు భరోసా ఇస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం రూ.49 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీడీపీ నేత దాసరి రాజామాస్టర్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించామని వెల్లడించారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఆరోగ్యాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ తాను అందుబాటులో ఉంటానని, ప్రజల కోసం ప్రతి నిత్యం పని చేస్తానని స్పష్టం చేశారు.

విఘ్నాలు తొలగిపోవాలి

ప్రతి ఇంటా విఘ్నాలు తొలగిపోవాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వినాయకచవితి సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాలను శుక్రవారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో వినాయక విగ్రహాలకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నగరంలో కాలుష్యం మెరుగైంది : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం (ఎన్ క్యాప్)లో భాగంగా గుంటూరు నగరంలో చేపట్టిన పనుల వలన ఆయా ప్రాంతాల్లో వాయు కాలుష్యం మెరుగైందని, నగరంలో మరి కొన్ని ప్రాంతాల్లో కూడా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పరిశ్రమల శాఖ, జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్.క్యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో గుంటూరు నగరంలోని జేకేసీ కాలేజి రోడ్, కలెక్టరేట్ లో, బ్రాడీపేట 4వ లైన్ వంటి ప్రాంతాల్లో నిర్మాణం చేసిన ఎండ్‌టుఎండ్ రోడ్ల వలన ఆయా ప్రాంతాల్లో వాయు కాలుష్య శాతం తగ్గిందన్నారు. రానున్న కాలంలో నగరంలో ప్రధాన రోడ్లన్నీ ఎన్ క్యాప్ కార్యక్రమంలో ఎండ్ టు ఎండ్ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ మధుసూదనరెడ్డి, ప్రొఫెసర్ బాలప్రసాద్(ఆంధ్రా యూనివర్సిటీ), కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ సుమంత్, కన్సల్టెంట్ కోమలి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

31, సెప్టెంబరు 1,2 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం

ఈ నెల 31వ తేదీన ఉదయం సరఫరా అనంతరం నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుంచి హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్ తాగునీటి సరఫరా జరిగే 900 ఎంఎం డయా పైప్ లైన్‌కు నెహ్రూ నగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ చేయడానికి జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేశారని, ఏఈల వారీగా తాగునీటి సరఫరా చేసేలా వాటర్ ట్యాంకర్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనుల కోసం తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లోని ఫిల్టరేషన్ పాయింట్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీని వలన 31వ తేదీ సాయంత్రం నుంచి సెప్టెంబరు 2వ తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, 2వ తేదీ సాయంత్రం నుంచి పాక్షికంగా 3వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు. పనుల వలన నగరంలోని హెచ్‌ఎల్‌ఆర్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కోర్టు కాంపౌండ్, కేవీపీ కాలనీ, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాలబీడు, వసంతరాయపురం, శారదా కాలనీ, రెడ్డిపాలెం, గోరంట్ల, నగరాలూ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి అంతరాయం కలుగుతుందన్నారు.

జీజీహెచ్‌లో దళారులను నమ్మొద్దు : సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో తచ్చాడే దళారుల మాయ మాటలు నమ్మి రోగులు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు ఉచితమేనని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం మీ కోసం మేము కార్యక్రమంలో భాగంగా రోగులు, వారి సహాయకులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కొందరు దళారులు ఆసుపత్రిలో తిరుగుతూ పలువురి పేర్లు చెప్పి రోగులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డాక్టర్ రమణ తెలిపారు. రోగులు ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. వైద్యసేవలకు ఎవరైనా డబ్బులు అడిగితే రోగులు నేరుగా సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించేందుకు వచ్చే సహాయకులు తమ వెంట చిన్న పిల్లలను తీసుకురావద్దని, ఆసుపత్రిలో పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంటుందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు తదితరులు మాట్లాడారు. అనంతరం స్వచ్ఛంధసంస్థ ప్రతినిధి నాగరాజ కుమారి ఆధ్వర్యంలో రోగి సహాయకులకు వస్త్రాలతో తయారు చేసిన సంచులను పంపిణీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణ యశస్వి, బీవీ రావు

రాజధాని ప్రజలకు ఉచిత విద్య, వైద్యం కల్పించాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ పూలింగ్ చట్టం మేరకు రాజధాని ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. బ్రాడీపేట, ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ 10వేల కోట్ల విలువైన భూములను తక్కువ ధరలకే వైద్య, విద్య సౌకర్యాల కోసం ప్రైవేటు యూనివర్సిటీలకు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ రాయితీలతో భూములు ఇస్తున్నప్పుడు ఆ రాయితీలు విద్యార్థులకు, ప్రజలకే దక్కాలన్నారు. ఈ రాయితీలు క్యాపిటల్ పరిధిలో ఉన్న 56 మండలంలోని విద్యార్థులకు అందేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై నేతాజీ, పాశం రామారావు, కె నళినీకాంత్, ఎన్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, ఎం.రవి పాల్గొన్నారు.

సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపు, నిమజ్జనం చేయాలి

● పలు మండపాలు సందర్శించి సూచనలు చేసిన ఎస్పీ



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పద్ధతిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వినాయక విగ్రహాల ఊరేగింపు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవ పందిళ్లను పరిశీలించారు. ఆయా వినాయక విగ్రహాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, పోలీస్ అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.

చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండవరం, గొడవర్రు గ్రామాలను సందర్శించి, స్థానికులతో సంభాషించి, వినాయక ఉత్సవాల నిర్వహణ కోసం వారు చేస్తున్న ఏర్పాట్ల గురించి తెలుసుకుని, ఉత్సవాలు, ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో మన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా ఏదైనా అనుకోని ఘటన ఎదురైతే వెంటనే పోలీస్ వారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రతి వినాయక విగ్రహ ఊరేగింపు, నిమజ్జనం వద్ద తగినంత మంది పోలీస్ సిబ్బందిని నియమించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

తదనంతరం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన 90 అడుగుల ఎత్తుగల మట్టి వినాయక విగ్రహాన్ని దర్శించుకుని అక్కడ చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించారు. నిర్వాహకులు, భక్తుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని, స్థానిక పోలీస్ వారితో సమన్వయం కలిగి ఉత్సవాలు నిర్వహణ, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు వివరాలు ఎప్పటికప్పుడు వారికి తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు , చేబ్రోలు ఎస్సై వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలి

● నిర్వాహకులకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ సూచనలు

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నిమజ్జన కార్యక్రమాలు పూర్తిగా శాంతియుతంగా, గందరగోళం లేకుండా నిర్వహించాలని వెస్ట్ డీఎస్పీ కె అరవింద్ సూచించారు. వినాయక చవితి వేడుకలు నిర్వహించే నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. వివాదాస్పద గీతాలు , అసహజమైన చర్యలు నిరోధించాలన్నారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సమయ పాలన, నిమజ్జన కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేసి, రాత్రివేళల్లో అనవసర జాప్యం చేయరాదన్నారు.

శబ్ద కాలుష్యం తగ్గించటం, హై డెసిబెల్ సౌండ్ సిస్టమ్స్, డీజే మ్యూజిక్ వినియోగాన్ని పరిమితం చేయాలన్నారు. ఎత్తైన విగ్రహాలు తరలించే సమయాలలో విద్యుత్ తీగలకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు తక్షణమే దగ్గర్లో ఉన్న పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు. లేదంటే డయల్ 112కు సమాచారం అందించాలని, కమిటీ సభ్యులు పోలీస్ వారికి పూర్తిస్థాయి సహకారం అందించాలని కోరారు.



హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మన్నవ మోహనకృష్ణ

హరికృష్ణ సేవలు మరువలేనివి: మన్నవ

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు నందమూరి హరికృష్ణ అందించిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ కొనియాడారు. గుంటూరు జేకేసీ నగర్ ఫస్ట్‌లైనులోని తన కార్యాలయంలో ఆయన హరికృష్ణ వర్ధంతి నిర్వహించారు. హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా ఆయన ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు.

కొల్లి శారద మార్కెట్ షాపులకు తాళాలు

గుంటూరుకార్పొరేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద పాత వ్యాపారులు ఆందోళన దిగారు. శుక్రవారం నగరపాలక సంస్థ చెందిన డిప్యూటీ కమిషనర్లు, ఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పెద్ద ఎత్తున తరలి వెళ్లి 24 షాపులను ఖాళీ చేయించి తాళాలు వేశారు. మిగిలిన షాపులు కూడా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో అందులో ఉన్న పాత వ్యాపారులంతా ఆందోళన దిగారు. నందివెలుగు రోడ్లో బయట నుంచి రాస్తారోకో చేశారు. అనంతరం కొద్దిసేపు ధర్నా చేపట్టారు. ఇటీవల ఈ మార్కెట్లోని షాపులకు లీజులు నిర్వహించారు. దీంతో గతంలోకన్నా రూ. 6 కోట్లు అదనంగా కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చింది. దీంతో వేలంలో షాప్ పాట పాడుకున్న వారికి అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు దుకాణాలను స్వాధీనం చేసుకోవడానికి పూనుకున్నారు. దీన్ని గమనించిన పాత వ్యాపారులు తమకు కొంత కాలం గడువు కావాలని కోరారు. దీంతో కుదరదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. షాపులను స్వాధీనపరుచుకుంటారని భయంతో రోడ్డుకి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, డీ శ్రీనివాస రావు, శ్రీనివాసు, ఆర్వోలు, ఆర్‌ఐలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కొల్లి శారద మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న వ్యాపారులు

గవర్నమెంట్ ప్లీడరుగా షేక్ ఫరూక్



షేక్ ఫరూక్

గుంటూరు(లీగల్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంతో పాటు నగరం లోని ఇతర న్యాయస్థానాలకు ఇన్చార్జి గవర్నమెంట్ ప్లీడరు (జీపీ)గా షేక్ ఫరూక్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో నియమితు లై ఇప్పటివరకు గవర్నమెంట్ ప్లీడరు గా పనిచేస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ గా పనిచేస్తున్న ఎంఎస్ లక్ష్మీ లను తొలగి స్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ పోస్టుల్లో తదుపరి నియామకాలు జరిగే వర కు ప్రస్తుతం గుంటూరు కార్మిక న్యాయస్థానంలో అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడరుగా పనిచేస్తున్న ఫరూక్ ను ఇన్చార్జిగా నియమించారు.

క్రీడా దినోత్సవ అవార్డులు బహుకరణ

గుంటూరు(క్రీడలు) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) గుంటూరు జిల్లా స్పోర్ట్స్ ఎక్సెలెంట్ అవార్డుకి ఎంపికైన పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులను,ప్రధానోపాధ్యాయులను శుక్రవారం గుంటూరు ఆర్జేడీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో క్రీడలలో ప్రతిభను కనబరిచిన పాఠశాలలను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడి లింగేశ్వర్ రెడ్డి, ఆర్ఐ పీ బాషా, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రవి,గుంటూరు జిల్లా పీఈటీ అండ్ ఎస్ ఏపీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కొండయ్య తదితరులు అవార్డు గ్రహీతలకు సన్మాన పత్రాలు, మెమెంటోలను అందజేశారు. గుంటూరు జిల్లా స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు పొందిన వారిలో మొదటి స్థానం నవ్వులూరు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ పీడీ సాంబశివరావు, రెండవ స్థానంలో పల్లపాడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ సుబ్బారావు, మూడవ స్థానంలో నూతక్కి జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ చెందిన రజినీనాయక్, నాలుగో స్థానంలో ఉప్పలపాడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్, సీహెచ్ వినయ్ కుమార్, ఐదవ స్థానంలో నారాకోడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్, పీడీలు ఉమామహేశ్వరి, పీ అన్నల కుమారి లు ఉన్నారు.

నేడు కేంద్ర మంత్రి పెమ్మసాని సమీక్షలు

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పలు శాఖల కార్యక్రమాలపై శనివారం సమీక్షించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో రైల్వే ప్రాజెక్టులపై పెమ్మసాని తొలుత సమీక్షిస్తారు. ఆ తర్వాత 11 గంటలకు గృహనిర్మాణ కార్యక్రమాలైన పీఎంఏవై గ్రామీణ్, అర్బన్, ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరపాలకసంస్థకు సంబంధించిన అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష చేపడతారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కనీస పెన్షన్ రూ 9వేలు, డిఏ, ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని ఆలిండియా పెన్షనర్స్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారించాలని కోరుతూ కృష్ణానగర్ పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటి జిల్లా కార్యదర్శి కే.బాబు ప్రసాదు మాట్లా డుతూ హయ్యర్ పెన్షన్, హయ్యర్ వేజెస్ కోసం చేసుకున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. 1995లో ప్రారంభమైన పెన్షన్ విధానం నేటికి సవరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెయ్యి రూపాయిలు పొంది తున్న పెన్షనర్లు దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్నారని అన్నారు. కార్పస్ నిధులు వేల కోట్లు రూపాయలు కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉందని, పెన్షన్ పెంచ మని కోరితే మా దగ్గర డబ్బులు లేవని సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని విమర్శించారు. సమస్యలపై స్పందించి తగు న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం పీఎఫ్ కమిషనర్ ప్రభు దత్తాప్రష్టికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో పీ.శేషగిరిరావు, కే గంగాధరరావు, రామచంద్రయ్య, వీ సాంబ శివరావు, ఏ నికల్స్, బీ నాగేశ్వరావు, తానయ్య తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ కమిషనర్ ప్రభు దత్తాప్రష్టికి వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్లు

తమ్ముడిని హతమార్చిన అన్న అరెస్టు

● ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్



నిందితుడిని అరెస్టు చేసిన ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తమ్ముడిని హత మార్చిన అన్నను అరెస్టు చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ శుక్రవారం తెలిపారు. గుంటూరు రామిరెడ్డి తోటకు చెందిన కంచర్ల సురేష్ అనే వ్యక్తి ఆటో డ్రైవర్ గా జీవిస్తున్నాడు. తన అన్న అయినా కంచర్ల రమేష్ తో సురేష్‌కు తరచు గొడవ జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 22వ తారీఖున తమ్ముడు సురేష్ పైన అన్న రమేష్ పెట్రోల్ పోసింది నిప్పు అంటించాడు. సమాచార తెలుసుకున్న సురేష్ భార్య హుటాహుటిన సంఘన స్థలానికి వచ్చి తన భర్త ను వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ తరలించింది. చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. ఈ సంఘటనకు కారకుడైన రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్, ఎస్ఐ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, 1వ లైన్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహానికి విశేషాలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట సాంబశివరావు, కుర్రా అప్పారావు, రావి రామచంద్ర రావు, నాయుడు సత్యనారాయణ, నర్రావుల అంకిరెడ్డి, వేమూరి సూర్యం, తరిగోపుల వంశీ కృష్ణ, మన్నవ శ్రీనివాస రావు, గుంటుపల్లి చంద్రశేఖర్, ముల్పూరి సతీష్, తరిగోపుల రవీంద్ర తదితరులు పూజల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

విద్యా గణపతిగా భక్తులకు దర్శనం



పుస్తకాలు, పెన్నుల అలంకరణలో విద్యా గణపతి

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట వాసవి యూత్ ఆధ్వర్యంలో 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు విద్యా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పెన్నులు, పుస్తకాలతో స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు పరీక్ష ప్యాడ్, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు.



గిడుగు, హరికృష్ణ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ నేతలు

తెలుగు భాషకు మార్గదర్శి గిడుగు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు గిడుగు వెంకట రామమూర్తి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. తెలుగు సాహితీ జగత్తులో అజరామరుడైన కవి గిడుగు జయంతి వేడుకలు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, మహానటుడు నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని పార్టీ నాయకులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వినాయక చవితి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూజలు చేశారు. నల్లకుంటలోని పలు మండపాల్లో గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటితరానికి స్ఫూర్తిప్రదాత గిడుగు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వ్యవహార భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతయని సాహితీవేత్త డాక్టర్ వి. నాగరాజ్యలక్ష్మి కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ పాలకవర్గం, సంస్థ వారు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్యలు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ టి. రాధా బాయి సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ వి. నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజహితం కోసం వ్యక్తిగత జీవితాన్ని ఫణంగా పెట్టిన మానవ శాస్త్రవేత్త గిడుగు అని పేర్కొన్నారు. సంస్థ కోశాధికారి డాక్టర్ మైలవరపు లలితకుమారి మాట్లాడుతూ నిత్యజీవితంలో మాతృభాష తెలుగు ప్రాధాన్యాన్ని వివరించారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితివేత్తలు

గిడుగు రామ్మూర్తి స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయం

● రాష్ట్రీయ పండిత పరిషత్ అధ్యక్షుడు సాంబయ్య

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధి కోసం కృషి చేసిన గిడుగురామ్మూర్తి స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని రాష్ట్రీయ పండిత పరిషత్ అధ్యక్షులు పల్లెపోగు సాంబయ్య అన్నారు. గిడుగురామ్మూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు ఆయన గిడుగు రామ్మూర్తి కృషి చేశారని, తెలుగుభాష పరిరక్షణకు నేటి తరం యువత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పలతోటి శశికిరణ్, కొత్తపల్లి సాయిబాబు, నడికోట భాస్కరరావు, బలుసుపాటి బసవలింగయ్య, శిఖా చంద్రమౌళి, ఐడిబి నాయక్ పాల్గొన్నారు. తొలుత గిడుగురామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అమ్మభాషే అన్ని భాషలకు దిక్సూచి : సుబ్బారావు

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమ్మ భాష ద్వారానే అన్ని భాషలు నేర్చుకోవటం చాలా తేలికగా ఉంటుంది అని శ్రీ సరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల కరస్పాండెంట్ డివి సుబ్బారావు తెలిపారు. మంగళగిరి రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడారు. పాఠశాల కార్యదర్శి సుబ్బారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు మానసవీణ, ఉపాధ్యాయులు జయరాం, సంగీత, నాగమేరీ, తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానం

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొద్దిమంది పండితులకు పరిమితమైన గ్రాంథిక భాషను వ్యవహారికా భాషగా మార్చుచేసి పజల భాషగా మార్చేందుకు విశేషంగా కృషి చేసిన గిడుగు రామ్మూర్తి ఆధునిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు అని ప్రముఖ రచయిత, రాష్ట్ర ప్రభుత్వ కళా రత్న అవార్డు గ్రహీత ఎంఎస్‌పీఎం ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు భాషా విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఆర్ జ్యోత్స్నకుమారి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి, డాక్టర్ ఎస్ దివిజ దేవి, డాక్టర్ వాసిరెడ్డి భవాని, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ ధాత్రికుమారి, డాక్టర్ చిలుక అనిత తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన్ నిరుల కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా దినోత్సవం నిర్వహించారు. జెఎన్‌టీయూ, కాకినాడ సౌత్ జోన్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టీం లకు ఎంపికయిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కిషోర్ కుమార్ ఫిట్నెస్ ట్రైనర్ కందిమళ్ళ స్వప్న విద్యార్థినులకు వ్యాయామంపై అవగాహన కల్పించారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ పాతూరి రాధిక


అలరించిన సినీ సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, అన్నదాత సమాజ ఆడిటోరియంలో మల్లేశ్వరి మ్యూజికల్ మెలోడీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రముఖ గాయకులు జమదగ్ని మార్కండేయులు, బిల్లా అశోక్, బాబురావు, అబ్దుల్ ఖాదర్, ఇస్మాయిల్, అన్నం రమేష్, నారాయణ, వెంకటేశ్వర్లు, మోహన కృష్ణ, వాసు, అన్నపూర్ణ, వై హేమమాలిని, మల్లేశ్వరి తదితరులు పాల్గొని పలు చలనచిత్రాల్లోని పాటలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, జనసేన పార్టీ నాయకులు మిరియాల గోపి కుమార్, మిరియాల ప్రసాదరావు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు.









రూ.77,77,777..

పెదనందిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా..లంబోదరుడికి వివిధ అలంకరణలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. నాగులపాడులో శ్రీ రామ యూత్ ఆధ్వర్యంలో 15 వార్షికోత్సవం సందర్భంగా గణనాథుడిని రూ.77,77,777ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు.

గాజువాక గణపతికి.. భారీ లడ్డూ నివేదన

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో లక్ష చీరలతో చేసిన గణపతికి నైవేద్యంగా భారీ లడ్డూని తెనాలిలోని చెంచుపేట శ్రీ మాతా ఫుడ్ ప్రొడక్ట్స్ యజమాని ఉప్పల నంద కిషోర్ చేయించారు. రెండు వేల కేజీల బరువు కలిగిన ఈ లడ్డూని శివ లింగం ఆకృతిలో .. ఎనిమిది అడుగుల ఎత్తులో 15 మంది నిపుణులు నాలుగు రోజులు శ్రమించి తయారు చేశారు. ఇంత భారీ సైజులో గణపతికి లడ్డూ ప్రసాదం నివేదన చేయడం..గిన్నిస్ రికార్డు సాధించేందుకు అవకాశం ఉంటుందని మిఠాయి దుకాణం యజమాని అభిప్రాయపడుతున్నారు. లడ్డూని గాజువాక తరలించేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు.

'ధన'పతి

● రూ 22 లక్షల కరెన్సీతో విఘ్నేశ్వరునికి విశేష అలంకారం

నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట కాకతీయ నగర్‌లోని శ్రీ సాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి శుక్రవారం రూ.22 లక్షల నగదుతో విశేష అలంకారం గావించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.2.35 కోట్ల నగదే.. తోరణాలు, పుష్పాలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం రూ.2.35కోట్ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక వ్యాపారుల సహకారంతో ఈ ఏడాది భారీ గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేసి ధన గణపతిగా అలంకరించారు. పూల మార్కెట్ సెంటరులోని కస్తూరి కంగన్ హాలు వద్ద ఏర్పాటు చేసే ఈ వినాయకుడిని ఏటా కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. 19 ఏళ్ల నుంచి సంకా బాలాజీ గుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తున్నారు. రూపాయి నోటు దగ్గరి నుంచి రూ.500 కరెన్సీ నోట్లతో పువ్వులు, తోరణాలను తయారు చేసి అలంకరించారు.



ద్యానబుద్ధ ప్రాంగణంలో త్రివిధ దళాల బృందంతో స్థానిక అధికారులు

బుద్ధుడి చూపిన మార్గంలో.. త్రివిధ దళాల బైక్ ర్యాలీ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు అందించిన శాంతి, కరుణ, దయ మార్గాలను నలు దిశలా వ్యాప్తి చేసేందుకు భారత త్రివిధ దళాల అధికారులు ఆరుగురు శుక్రవారం అమరావతిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైజాగ్‌లో ప్రారంభమై.. ఈ బుద్ధ సర్క్యూట్ ర్యాలీ రాజమండ్రి, విజయవాడ, అమరావతి, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు వరకు జరుగుతుంది. రాహుల్ పాటిల్ కన్వీనర్‌గా బిమ్‌స్టెక్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ యాత్రలో పాల్గొన్నారు. అమరావతిలో ధ్యాన బుద్ధ ప్రాజెక్టు సందర్శించిన అనంతరం ర్యాలీని తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య, టూరిజం అధికారి నాయుడమ్మ, మేనేజర్ మణికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పురాతన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషణకు బుద్ధ సర్క్యూట్ పేరుతో ఈ యాత్ర ఉపకరిస్తుందని రాహుల్ పాటిల్ పేర్కొన్నారు. ఈ యాత్రకు విదేశాంగ, గృహ మంత్రిత్వ శాఖలు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, నలందా యూనివర్సిటీ, బిమ్‌సెక్ట్ సెక్రటేరియట్ మద్దతు ఇవ్వడం ద్వారా భారతదేశం ఐక్యత, ప్రాంతీయ సాంస్కృతిక దౌత్యం పట్ల ఉన్న దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణి పాల్గొన్నారు.

టీసీలే జనరల్ టిక్కెట్ ఇస్తారు

● రైల్వే బోర్డు ప్రత్యేక సాఫ్ట్‌వేర్
● చేతికి హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్
● తప్పనున్న క్యూలైన్ కష్టాలు



హ్యాండ్‌సెట్, ప్రింటర్‌తో టీటీఈ

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో జనరల్ టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ ఏటీవీఎం, యూటీఎస్ వంటి ఆన్‌లైన్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ నేటికీ ప్రధాన రైల్వేస్టేషన్లలో కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రైల్వే టిక్కెట్ తనిఖీ సిబ్బందికి ఒక హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్‌ని ఇచ్చి ప్లాట్‌ఫాం వద్దనే జనరల్ టిక్కెట్‌లను జారీ చేసే బాధ్యతలు కేటాయించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో ట్రయల్ రన్ కూడా నిర్వహిస్తున్నారు. రాబోయే పండగల సీజన్‌లో రద్దీ పెరగనున్న దృష్ట్యా ఆలోపే టీటీఈలు జనరల్ టిక్కెట్‌లు జారీ చేసే సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ భావిస్తోంది. దీని వల్ల అటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు ఇటు రైల్వేకు ఆదాయం వస్తుంది.

క్యూలైన్ కష్టాలకు చెక్..

టీటీఈలు హ్యాండ్‌సెట్లు అందుబాటులోకి రాని రోజుల్లో చేతివాటం ప్రదర్శించేవారు. నేటికీ కొంతమంది ఈఎఫ్‌టీల విషయంలో ఇదే వైఖరిని కలిగి ఉన్నారు. దీని వల్ల రైల్వే శాఖ ఆదాయం కోల్పోతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల నుంచి హ్యాండ్ సెట్ల విధానాన్ని రైల్వే శాఖ అందు బాటులోకి తీసుకొచ్చింది. దీనికి అదనంగా వైఫై/బ్లూటూత్ సదుపాయంతో మెడలో ధరించే ఒక ప్రింటర్‌ని కనెక్టు చేసి వాటి ద్వారా జనరల్ టిక్కెట్లు జారీ చేసే సాఫ్ట్‌వేర్‌ని అభివృద్ధి చేసింది. ఈ సదుపాయం వల్ల ప్రయాణికులు టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్‌లో నిలబడకుండా నేరుగా టీటీఈ వద్దకు వెళ్లి ఎక్కడికి ప్రయాణించదలిచాలో చెబితే వెంటనే నగదు చెల్లించుకొని జనరల్ టిక్కెట్ జారీ చేస్తారు. దీని వల్ల రైల్వేకు టిక్కెట్ కౌంటర్లు, యూటీఎస్ యాప్, ఏటీవీఎంలతో పాటు టీటీఈల ద్వారా కూడా ఆదాయం వస్తుంది.



సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల వరద నీరు

సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

విజయపురిసౌత్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,211, 20 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 6 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,43,862, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,88,302 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 2,88,302 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ఉత్పత్తి ఆపేశాం

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 గేట్లకు గాను 17 రేడియల్ క్రస్ట్ గేట్ల స్పిల్‌వే నుంచి పులిచింతలకు 2,80,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 15 గేట్లు 3 మీటర్లు, 2 గేట్లు 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 2,77,316 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపివేశామన్నారు. రిజర్వాయర్‌లో 74.42 మీటర్ల మేర నీరుండగా.. 6.035 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు, ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు ప్రధాన వాగుల నుంచి శుక్రవారం 3,08,838 క్యూసెక్కుల వరద శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,96,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,425 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థులపై పెరుగుతున్న సబ్జెక్ట్ భారం!



వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో విద్యార్థులు, భోదన సిబ్బంది

● హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యార్థులపై సబ్జెక్ట్ భారం పెరుగుతోందని, ఇది ఆందోళన కలిగించే అంశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వైద్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం ఈదుల పాలెంలోని కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీబీఎంఈ పాఠ్యక్రమంలో ఉన్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ పార్ట్ 1, పార్ట్ 2 విద్యార్థులు ఎదుర్కొంటున్న సిలబస్ ఇబ్బందులు, పార్ట్ 2 విద్యార్థులపై అధికమైన సబ్జెక్టుల భారం గురించి ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారానికి విశ్వవిద్యాలయం విద్యార్థుల పక్షానే నిలుస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల సంఖ్య దృష్ట్యా మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అవసరమన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఏటా ఒకసారి వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. వైద్యులు నిరంతర విద్యార్థులుగా ఉంటేనే వృత్తిలో రాణిస్తారని స్పష్టం చేశారు. నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమాలలో పాల్గొనడం, పరిశోధనలో చురుకుగా భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు..

విజ్ఞాన్ నిరుల విద్యార్థినులు

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 30 మంది విద్యార్థినులు వివిధ విభాగాల పాల్గొన్నారని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ హ్యాకథాన్ విద్యార్థినుల తర్కిక ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా మలచుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ధైర్యంగా సృజనాత్మక సవాళ్లను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆర్అండ్ డి.డాక్టర్ వి. లక్ష్మణ్ నారాయణ, డాక్టర్ సత్య సందీప్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు

సంపూర్ణ క్రమశిక్షణ వీవీఐటీయూ నినాదం



సరస్వతి దేవికి పూజలు చేస్తున్న వర్సిటీ చాన్సలర్ విద్యాసాగర్, విద్యార్థులు

● చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మంచి నడవడికతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని వీవీఐటీయూ విశ్వసిస్తుందని చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. క్రమశిక్షణతో కూడిన అధునాతన విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటుగా విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను విశ్వవిద్యాలయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో 2025-26 ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రవేశ పరీక్షలో టాప్ ర్యాంకర్లగా నిలిచి, ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ వీవీఐటీ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన వెంటనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. వారి నమ్మకం తమపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం లోకమంతటా ప్రసిద్ధి చెంది తమ విద్యార్థులు గర్వంగా చెప్పుకోగలిగేంత వరకూ విశ్రమించమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లడుతూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు సీమన్స్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం వల్ల విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ వై. మల్లికార్జున రెడ్డి మాట్లడుతూ మెరుగైన భవిషత్తుకు విద్యార్థుల కృషి కీలకమన్నారు. వారి కృషికి సరిపడా అన్ని వసతులను వీవీఐటీ విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని వారి ఉపాధి, ఉన్నత విద్య కొరకు ఉపాధికల్పన, శిక్షణ విభాగం పనిచేస్తుంద న్నారు. మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కొరకు పనిచేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని అన్నారు. అడ్మిషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లడుతూ లక్ష్యాన్ని మొదటి నుంచి నిర్దేశించుకుని, విద్యార్థులు 100 శాతం తరగతులకు హాజరుకావాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ కోర్సులకు మంచి స్పందన లభించిదని అన్నారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్. సెక్రటరి సూర్యదేవర బదరిప్రసాద్, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రాజధానిలో రైతులకు ప్లాట్లు



రైతులకు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు ఇస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

తుళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు ఈ-లాటరీ విధానలో 75 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు అందజేశారు. లాటరీ కార్యక్రమం శుక్రవారం విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్‌రాజు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీఎస్‌బీ వసంతరాయుడు, పెనుమాక డిప్యూటీ కలెక్టర్ ఏ.జి.చిన్నికృష్ణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శివశంకర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 75 ప్లాట్లలో 45 నివాసానికి కాగా 30 వాణిజ్య ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. 33 మంది రైతులు, భూయజమానులకు ఆన్‌లైన్ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్‌రన్ వేసిన తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రకియ నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ పంచాయతీలో చెత్త కుప్పలు

● అలంకార ప్రాయంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ● పట్టించుకోని అధికారులు



చినకోండ్రు పాడులోని సంపద తయారీ కేంద్రం



చినకోండ్రుపాడు డొంక రోడ్డులో చెత్త కుప్పలు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డు నిర్వహణలో డిల్లీ స్థాయిలో అవార్డును అందుకోవడంతో పాటు మండలంలోనే ఆదర్శంగా నిలిచిన ఉత్తమ పంచాయతీ నడింపాలెం ఇప్పుడు అధమ స్థానానికి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల పర్యవేక్షణలో లోపమో... ఏమో కాని మండల పరిధిలోని నడింపాలెం పంచాయతీపైకి డాబుగా కనిపిస్తున్నా.. లోపలంతా కుళ్లు వాసన కొడుకొంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చి అమలుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే గ్రామస్థాయిలో అధికారులు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లపై చిన్నచూపు చూస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చడం లేదు. ఉపయోగపడే ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం అమ్ముకుంటూ మిగిలిన వ్యర్థాలను ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ పడేస్తున్నారు. ముఖ్యంగా రావిపాటివారిపాలెం సమీపంలో కాలువ వెంట వ్యర్థాలను పడేయడంతో రోడ్డు వెంట తిరిగే వారితో పాటు సమీపంలో ఉండే గృహాల వారికి దుర్వాసన వెదజల్లుతుంది. అంతే కాకుండా కుక్కలు బీభత్సం చేస్తూ పాడు చేస్తున్నాయి. అంతే కాకుండా కోండ్రుపాడు దాటిన తరువాత డొంకరోడ్డు బారుకి చెత్తను డంప్ చేస్తున్నారు.



ప్రత్తిపాడు, చినకోండ్రుపాడు రోడ్డులో చెత్త గుట్టలు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నుదురుపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

ఫిరంగిపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నుదురుపాడు గ్రామంలో నరసరావుపేట మండల న్యాయ సేవా కమిటీ శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. నరసరావుపేట మొదటి అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారిణి ఏ నలోమి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరప కూడదని, ముందస్తు గర్భదారణ పై అవగాహనను పెంపొందించుకోవాలని ఆమె తెలిపారు. ఈ సదస్సులో మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, తహసీల్దార్ జే ప్రసాదరావు సీఐ శివరామకృష్ణ, రెవెన్యూ అధికారులు, విద్యా శాఖ, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జానకీరామ్‌కు లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎ.జానకీరామ్‌కు తమిళనాడులో ప్రతిష్టాత్మకంగా భావించే డాక్టర్ నిత్యానందమ్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు-2025 లభించింది. ఇండియాలో ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌గా గుర్తింపు వున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీన చెన్నయ్ అన్నా సెంటినరీ లైబ్రరీలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య ఆర్ముగమ్ చేతుల మీదుగా డాక్టర్ జానకీరామ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు

కాకుమాను, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్ కెన్నడీ అన్నారు. మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కాకుమాను మోడరన్ ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ క్రీడల వలన స్నేహం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శీలం అంకారావు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

మంగళగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జాతీయ మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు మంగళగిరి ప్రాంతం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ పట్టణ కమిటీ విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ల రద్దు పేరుతో కార్మిక హక్కులను కాలరాసే విధానాలను తీసుకువచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు జేవీ రాఘవులు, ఎం.బాలాజీ, యూ.దుర్గారావు, టీ.శ్రీరాములు, షేక్ జానీ బాషా, కే.వెంకటేశ్వరమ్మ, వై.శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు ద్వారా రుణాలు పంపిణీ

మంగళగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరుగుతున్న మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి దేవస్థానం రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఖాతాదారులకు రుణాలు పంపిణీ చేశారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబై జనరల్ మేనేజర్ శ్రీనివాస్ హాజరై లబ్ధిదారులకు రుణాలు అందజేశారు.

అక్రమ రవాణా, బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలి

వట్టిచెరుకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలలను అక్రమ రవాణాదారుల నుంచి అలాగే బాల్య వివాహాలను అరికట్టడంలో క్షేత్ర స్థాయిలో ఆషా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల బాధ్యత కీలక మైందని ప్రత్తిపాడు ప్రాజెక్టు శిశు సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సురక్షిత గ్రామ కార్యకర్తలకు సురక్షిత గ్రామజ్యోతిపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

మలినేని విద్యార్థినుల ప్రతిభ

వట్టిచెరుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మలినేని విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు రెండో సంవత్సరం నుంచి హ్యాకథాన్, ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో పాల్గొంటూ ఆ అనుభవం, ఎక్స్‌పోజర్స్ వలనే నేడు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచటం కళాశాలకే గర్వకారణమని మల్లినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు పేర్కొన్నారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థినులు దేవిరెడ్డి నాగజ్యోతి, దావులూరి హారికా చౌదరి, ఆళ్ళ శివ పార్వతిలు మలేషియాలోని యూకేఎం యూనివర్సిటీలో జరిగిన ఐఈఈఈ వైఈఎస్ఐఎస్‌టీ 12 - 2025 అన్వేషణ్ ఛాలెంజ్, టీఆర్‌పీసీకే డైరెక్ట్ ఎంట్రీలో పాల్గొని తమ సృజనాత్మక ఆవిష్కరణలను విజయవంతంగా ప్రదర్శించారని పెరుమాళ్ళు కొనియాడారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థినుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు గ్లోబల్ ఎక్స్‌పోజర్స్ కల్పిస్తాయని, ఇది వారి కేరియర్ అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జే అప్పారావు మాట్లాడుతూ విద్యార్థినుల ప్రతిభను పెంపొందించేందుకు తాము ప్రోత్సాహం అందిస్తామని, అంతర్జాతీయ వేదికల్లో పోటీ చేయగల సామర్థ్యం కల్పించటం మా లక్ష్యం అన్నారు.


మలేషియాలో ప్రతిభాపత్రాలతో మలినేని విద్యార్థినులు

ప్రమాదభరితంగా దామరపల్లి-పొన్నెకల్లు రోడ్డు


కోతకు గురైన పొన్నెకల్లు-దామరపల్లి రోడ్డు

తాడికొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంతాలల్లోని ప్రధాన రహదారులు కోతకు గురై ప్రమాదభరితంగా మారాయి. కొండవీటి వాగు వరద నీరు దామరపల్లి గ్రామం నుంచి లాం చప్టాకు వెళ్తుంటాయి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించటంతో చాలా చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో దామరపల్లి-పొన్నెకల్లు రోడ్డు ప్రమాదభరితంగా తయారైయింది. రోడ్డు మార్జిన్లు కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కోతకుగురైన రోడ్డుకు మరమ్మతులు చేయకుండా ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకునిరైత్తి నట్లు వ్యవహరిస్తున్నారు. కోతకు గురైన రోడ్లు వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కంతేరు రోడ్డులో కోతకు గురైన ప్రాంతంలో తెల్లరంగు వేసిన రాళ్లను ఏర్పాటు చేశారు. లాం చప్టాపై రెండు చోట్ల తారు వరద నీటిలో కొట్టికుపోయింది. రాజదాని అమరావతి-గుంటూరు ప్రధాన రహదారిలో కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు కరువయ్యాయి. లాం చప్టాపై రెయిలింగ్ కూడా లేదు. వినాయక విగ్రహాలు నిమజ్జనం సందర్భంగా గుంటూరు, తాడికొండ మండలంలోని పలు గ్రామాల నుంచి వినాయక విగ్రహాలు ఈ రహదారి గుండా తీసుకుని వెళతారు. ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పంటించుకోని కోతకు గురైన రోడ్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కోతకు గురైన రోడ్డుపై తెల్లరాళ్లను ఉంచిన ఆర్అండ్‌బీ అధికారులు

ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం


తాడేపల్లి: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం


విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తున్న ధనుంజయరావు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను జోజప్ప ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను, క్రీడా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జోజప్ప మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు బాషా దినోత్సవాన్ని, అలాగే హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ఉపాధ్యాయులు డాక్టర్ తోట శ్రీనివాసరావు, ఇసుకపల్లి శరత్‌చంద్ర, విజయకుమారి, పీఈటీలు మెల్లెంపూడి రవి, నూతక్కి రవిలను ఘనంగా సత్కరించారు.

తెలుగును విస్మరిస్తే మాతృత్వాన్ని మరిచినట్టే - గుత్తికొండ ధనుంజయరావు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మనం ఎంత ఎత్తుకు ఎదిగినా అమ్మ వంటి తెలుగు భాషను విస్మరిస్తే మాతృత్వాన్ని మర్చిపోయినట్టేనని మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులకు జాతీయ సేవా పథకం, లైబ్రరీ సెల్, సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, ఆగస్టు,29(ఆంధ్రజ్యోతి) స్థానిక పీఏఎస్ కళాశాల, నంది పాఠశాల, లయన్స్‌మాంటిస్సోరీ సీబీఎస్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ క్రీడా, తెలుగు బాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పెదనందిపాడు: ధ్యానచంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

80శాతం రాయితీపై డ్రోన్ అందజేత


వడ్డమానులో చంద్రన్న గ్రూపు సభ్యులకు డ్రోన్ అందజేస్తున్న ఏవో సంధ్యారాణి

తుళ్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తుందని, 80 శాతం రాయితీపై డ్రోన్లు అందజేస్తున్నట్టు ఏవో పి.సంధ్యారాణి పేర్కొన్నారు. మండలంలోని వడ్డమాను గ్రామంలో చంద్రన్న కిసాన్ డ్రోన్ గ్రూపు సభ్యుడు పారా బుజ్జీ, సభ్యులకు వ్యవసాయశాఖ ద్వారా 80 శాతం రాయితీపై శుక్రవారం డ్రోన్ అందించినట్టు ఆమె తెలిపారు. డ్రోన్స్ 80 శాతం రాయితీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

గవర్నమెంట్ ప్లీడరుగా షేక్ ఫరూక్


షేక్ ఫరూక్

గుంటూరు(లీగల్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంతో పాటు నగరం లోని ఇతర న్యాయస్థానాలకు ఇన్చార్జి గవర్నమెంట్ ప్లీడరు (జీపీ)గా షేక్ ఫరూక్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో నియమితు లై ఇప్పటివరకు గవర్నమెంట్ ప్లీడరు గా పనిచేస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ గా పనిచేస్తున్న ఎంఎస్ లక్ష్మి లను తొలగి~స్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ పోస్టుల్లో తదుపరి నియామకాలు జరిగే వర కు ప్రస్తుతం గుంటూరు కార్మిక న్యాయస్థానంలో అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడరుగా పనిచేస్తున్న ఫరూక్ ను ఇన్చార్జిగా నియమించారు.

క్రీడా దినోత్సవ అవార్డులు బహుకరణ

గుంటూరు(క్రీడలు) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) గుంటూరు జిల్లా స్పోర్ట్స్ ఎక్సెలెంట్ అవార్డుకి ఎంపికైన పాఠశాలల వ్యాయామ ఉపాధ్యా యులను,ప్రధానోపాధ్యాయులను శుక్రవారం గుంటూరు ఆర్జేడీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్క రించుకొని జిల్లాలో క్రీడలలో ప్రతిభను కనబరిచిన పాఠశాలలను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి లింగేశ్వర్ రెడ్డి, ఆర్ఐ పీ బాషా, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం రవి,గుంటూరు జిల్లా పీఈటీ అండ్ ఎస్ ఏపీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కొండయ్య తదితరులు అవార్డు గ్రహీతలకు సన్మాన పత్రాలు, మెమెంటోలను అందజేశారు. గుంటూరు జిల్లా స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు పొందిన వారిలో మొదటి స్థానం నవ్వులూరు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ పీడీ సాంబశివరావు, రెండవ స్థానంలో పల్లపాడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ సుబ్బారావు, మూడవ స్థానంలో నూతక్కి జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ చెందిన రజినీనాయక్, నాలుగో స్థానంలో ఉప్పలపాడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్, సీహెచ్ వినయ్ కుమార్, ఐదవ స్థానంలో నారాకోడు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్, పీడీలు ఉమామహేశ్వరి, పీ అన్నల కుమారి లు ఉన్నారు.

జీజీహెచ్‌లో దళారులను నమ్మొద్దు


మాట్లాడుతున్న రమణ యశస్వి, జీవీ రావు

గుంటూరు మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో తచ్చాడే దళారుల మాయ మాటలు నమ్మి రోగులు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు ఉచితమేనని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం మీ కోసం మేము కార్యక్రమంలో భాగంగా రోగులు, వారి సహాయకులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కొందరు దళారులు ఆసుపత్రిలో తిరుగుతూ పలువురి పేర్లు చెప్పి రోగులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డాక్టర్ రమణ తెలిపారు. రోగులు ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. వైద్య సేవలకు ఎవరైనా డబ్బులు అడిగితే రోగులు నేరుగా సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించేందుకు వచ్చే సహాయకులు తమ వెంట చిన్న పిల్లలను తీసుకురావద్దని, ఆసుపత్రిలో పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంటుందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు తదితరులు మాట్లాడారు. అనంతరం స్వచ్ఛంధసంస్థ ప్రతినిధి నాగరాజ కుమారి ఆధ్వర్యంలో రోగి సహాయకులకు వస్త్రాలతో తయారు చేసిన సంచులను పంపిణీ చేశారు.

శారీరక మానసిక వికాసానికి క్రీడలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎన్నారై కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ తదితరులు

మేడికొండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శారీరక మానసిక వికాసానికి ఎంతో దోహదపడే క్రీడల్లో విద్యార్థులు పాల్గొనాలని ఎన్నారై కళాశాల ఎకడమిక్ డీన్ కోట శ్రీనివాస్ చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేడికొండూరు సమీపంలోని ఎన్నారై కళాశాలలో శుక్రవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంజయ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు

సీఎం సహాయనిధి నుంచి తక్షణ నగదు సాయం

దుగ్గిరాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): లివర్ సమస్యతో బాధపుడుతున్న దుగ్గిరాలకు చెందిన బెజ్జం హర్షితకు రూ.8 లక్షల సీఎం సహాయనిధి నగదు చెక్కును తెలుగుదేశం నాయకుల చేతుల మీదుగా అందించారు. గ్రామానికి చెందిన బెజ్జం శాంతరాజు కుమార్తె హర్షిత కొన్నాళ్లుగా లివర్ సమస్యతో బాధపడుతున్నది. అత్యవసర చికిత్స చేయించాలని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేక స్థానిక టీడీపీ నాయకుల ద్వారా మంత్రి నారా లోకేశ్‌దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన కలిసిన యువతి పరిస్థితి తెలుసుకున్న లోకేశ్ సీఎం సహాయనిధి నుంచి రూ.8లక్షలు మంజూరుచేయించారు. కేసంనేని శ్రీఅనిత, నాయుడు బాబూరావు, నక్కా చిరంజీవి, గద్దె వాసు తదితరులు చెక్కును హర్షితకు అందించారు. అలాగే వీర్లపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల శంకరరెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించిన రూ.1,72,156ల నగదు చెక్కును ఎంపీటీసీ విశ్వనాధపల్లి శివకుమార్, కేసంనేని శ్రీఅనితల చేతులమీదుగా అందించారు.


లివర్ సమస్యతో బాధపడుతున్న దుగ్గిరాలకు చెందిన హర్షితకు రూ.8 లక్షల నగదు చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు


ఎమ్మెస్సెస్ భవన్‌లో హరికృష్ణ చిత్రపటానికి నివాళి అర్పించిన టీడీపీ నాయకులు

హరికృష్ణకు టీడీపీ నేతల ఘననివాళి

మంగళగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి స్వర్గీయ నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా ప్రజలకు, పార్టీకి హరికృష్ణ చిరస్మరణీయమైన సేవలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, గాదె పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లడిగుంటలో లడ్డు వేలం పాట నగదు అందజేత


కమిటీ సభ్యులకు లడ్డు వేలం పాట నగదును అందజేస్తున్న మన్నవ గోపీకృష్ణ

వట్టిచెరుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో గత సంవత్సరం వినాయక చవితి సందర్భంగా జరిగిన లడ్డు వేలం పాటకు సంబంధించి శుక్రవారం పుల్లడిగుంటలోని గణనాధుని సమక్షంలో కమిటీ సభ్యులకు రూ 5.25 లక్షల నగదును మన్నవ గోపీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ ఉప్పుటూరి గోవర్ధనరావు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌లో రైతుల అర్జీలను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్

గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్

తుళ్లూరు, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డేను నిర్వహించారు. వార్షిక కౌలు చెల్లింపు, ల్యాండ్ పూలింగ్ స్కీం, రిటర్నబుల్ ప్లాట్ల అలాట్‌మెంట్, రిజిస్ట్రేషన్, అసైన్డ్ ల్యాండ్ సమస్యలు, గ్రామకంఠాలు తదితర సమస్యలపై పలువురు రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను గ్రీవెన్స్ డేలో అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కి అందజేశారు. అర్జీదారులు అందజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ తెలియజేశారు. వార్షిక కౌలు సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 59 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో ఓ వివాహిత కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన సంఘటన పట్టణ పరిధిలోని సీతానగరంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురానికి చెందిన దాసరి యామినికి అదే ప్రాంతానికి చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భర్త తాగి వచ్చి గొడవలు పడుతుండడంతో గత ఆరు నెలలుగా పుట్టింటిలో ఉంటోంది. తిరిగి భర్త వద్దకు వెళ్లగా అతను నిరాకరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్టు బాధితురాలు పోలీసులకు తెలిపింది. సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద కృష్ణానదిలో మునిగిపోతున్న యామినిని స్థానిక మత్స్యకారులు కాపాడి పోలీసులకు అప్పగించారు. తాడేపల్లి ట్రైనీ ఉమన్ ఎస్ఐ అపర్ణ బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి శ్రీనివాసరావుకు అప్పగించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకున్న రాజధాని యువత

తుళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్ మేళా శుక్రవారం జరిగింది. ఈ మేళాలో సెన్స్ సెమికండక్టర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీవీఎఆర్ ఇన్‌ఫ్రా టెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీతారామ ఆటోమోటివ్స్, క్వెస్ కార్ప్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్ మేళాకు 301 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 91 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆఫర్ లెటర్లు అందజేశారు.


జాబ్ మేళాలో ఉద్యోగం పొందిన యువతకు ఆఫర్ లెటర్ అందిస్తున్న అడిషనల్ కమిషనర్ సీఎస్ఎస్ ప్రవీణ్ చంద్, కంపెనీ హెచ్ఆర్‌లు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అర్బన్ బ్యాంక్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీబీ రోడ్డులో ఉన్న తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల షెడ్యూలు అధికారులు విడుదల చేశారు. సెప్టెంబర్ 14న పాలకవర్గానికి రహస్య బ్యాలెట్ పద్ధతిలో కార్యవర్గ ఎన్నికల నిర్వహిస్తారు. 7వ తేదిన బ్యాంకు కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ, 8న పరిశీలన, 9న ఉపసంహరణ, అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

ప్రజల నుంచి సమస్యలు రాకుండా చూసుకోవాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామాల ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. భూసర్వే కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డుల కొరకు పెట్టుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, మండల సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియం నిర్వాహకులకు జిమ్ పరికరాలు అందజేస్తున్న దాతలు

స్టేడియం జిమ్‌కు పరికరాల బహూకరణ

పొన్నూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని డీవీసీ ఇండోర్ స్టేడియంకు జిమ్ పరికరాలను పొన్నూరు పట్టణానికి చెందిన దాతలు శుక్రవారం అందచేశారు. పొన్నూరు పట్టణానికి చెందిన జే గోపీకృష్ణ, ఎం ఫణికుమార్ స్టేడియంలోని వ్యాయామశాలకు ఐదు కిలోల రెండు డంబెల్ సెట్లు, 7.5 కిలోల రెండు డంబల్ సెట్లు, పలు రకాల కెటిల్ బెల్స్, 30 అడుగుల రోప్, జిమ్ బాల్ తదితర పరికరాలను స్టేడియం కోచ్ చావా గోపికి అందించారు.



కొల్లిపరలో బలరామజయంతిని నిర్వహిస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

వైభవంగా బలరామ జయంతి

కొల్లిపర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర శ్రీఅభయఅంజనేయస్వామి ఆలయం వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం బలరామ జయంతిని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు వైభవంగా నిర్వహించారు. బలరామ చిత్రపటానికి కిసాన్ సంఘ్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండా కిశోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బద్ధిగం నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ స్కూల్‌లో క్రీడా దినోత్సవం

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్కూల్ ఎండీ మురళీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సాధించాలన్నారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళితే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలను ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలన్నారు. ఈడీ గీతా కాంత్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో తెనాలి విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జరిగిన అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తెనాలి విద్యార్థులు ప్రతిభ చూపారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోటీల్లో 6వేలకు పైగా విద్యార్థులు పోటీ పడ్డారని, మాస్టర్ బ్రెయిన్ అబాకస్ సంస్థ డైరెక్టర్లు షఫియా, షకియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, జ్ఞాపికలను విద్యార్థులు హేత్విక్, అభిరామ్, విహాన్, నాగహాష్విక్, ప్రభంజన్, దినాస్, మిధున్, తక్ష, సాయి వరుణ్‌లు సాధించారని తెలిపారు.

నేడు మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు సభ

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిరావు పదవీ విరమణ, వీడ్కోలు సభ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం నిర్వహిస్తారు. ఆంధ్రాప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.



అన్నదానం చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

ప్రగడ కోటయ్య నగర్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రగడ కోటయ్య నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ బీ జనార్ధనరావు ప్రారంభించారు. పద్మశాలీ యూత్ ఆధ్వర్యంలో 30వ గణేష్ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం విశేష పూజల్లో డీఎస్పీ పాల్గొన్నారు. యువత చెడు వ్యసనాలబారిన పడకుండా సామాజిక సేవ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటం మంచి పరిణామం అన్నారు. సెల్‌ఫోన్‌తో జీవితం వెళ్ళబుచ్చకుండా మంచి ఆలోచన చేసి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా యువత డీఎస్పీని ఘనంగా సన్మానించారు.

భారీ వర్షాలతో రహదారులు గోతులమయం

● ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

● ఆరు రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి ప్రతిపాదనలు



వర్షాలకు చింతలపూడి వద్ద జీబీసీ రోడ్డుపై పడిన గుంత



వర్షాలకు దెబ్బతిని గుంతలు పడిన కసుకర్రులోని ప్రధాన రహదారి

పొన్నూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పొన్నూరు మండలంలో కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రానికి అనుసంధానమై ఉన్న పలు ప్రధాన రహదారులు ధ్వంసం అయ్యాయి. భారీ వర్షాలు, గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో పొన్నూరు పట్టణానికి అనుసంధానంగా ఉండే ప్రధాన రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ప్రధానంగా పొన్నూరు పట్టణం నుంచి బాపట్ల వైపు వెళ్లే ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు, వీవర్స్ కాలనీ నుంచి చింతలపూడి వరకు భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నది. పొన్నూరు నుంచి కాకుమాను మండలం పాండ్రపాడు వెళ్లే ప్రధాన రహదారి కసుకర్రు గ్రామం వద్ద పూర్తిగా ధ్వంసం అయింది. పట్టణ శివారు నుంచి కసుకర్రు గ్రామం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి భారీ గోతులు ఏర్పడి ప్రయాణం కష్టతరంగా మారింది. ఈ రహదారిపై రోజుల తరబడి వర్షపు నీరు నిలబడి ఉడడంతో గ్రామంలో పారిశుధ్య సమస్యలు సైతం తలెత్తాయి. ఈ రహదారి కసుకర్రు గ్రామం నుంచి వెళ్లడంతో గ్రామానికి ఇరువైపు గృహాలు నిర్మితం కావడంతో కురిసిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపై రోజుల తరబడి నిల్వ ఉంది. దీంతో రహదారిపై ఉన్న తారు వాన నీటికి లేచిపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ భారీ గుంతల నుంచే వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారిపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, ద్విచక్ర వాహన దారులు సైతం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇవే కాకుండా మండల పరిధిలోని జూపూడి, బ్రాహ్మణకోడూరు, మాచవరం, ఆలూరు, పట్టణంలోని నిడుబ్రోలు నుంచి గుంటూరు వెళ్లే ప్రధాన రహదారి సైతం వర్షాలకు దెబ్బతింది.

మరమ్మతులకు ప్రతిపాదనలు...

భారీ వర్షాలకు దెబ్బతిన్న పొన్నూరు మండలంలోని ప్రధాన రహదారులు తాత్కాలిక మరమ్మత్తులతో పాటు, శాశ్వత ప్రాతిపదికన రహదారుల నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు నివేదికల రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పట్టణం నుంచి బాపట్ల వెళ్లే జిబిసి రోడ్డు, చింతలపూడి రహదారి, నిడుబ్రోలు, ఇంటూరు రోడ్డు, మాచవరం, అల్లూరు, పొన్నూరు - పాండ్రపాడు, బ్రాహ్మణకోడూరు - జూపూడి రహదారులు కిలోమీటర్ల మేర ధ్వంసం అయ్యాయి. ఈ రహదారులకు ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చటంతో పాటు రహదారులు శాశ్వత మరమ్మతులు చేపట్టేలా అధికారులు సుమారు 15కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ప్రభుత్వం అనుమతిస్తే తక్షణమే రహదారులు మరమ్మతులు చేసి వాహనదారులకు ఇబ్బందులు తొలగిందుకు అధికారులు సిద్ధమయ్యారు.


పూజలు...ఊరేగింపులు



వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాల్లో ఘనంగా పూజలు చేస్తున్నారు. గంగానమ్మపేటలోని సిద్ధి వినాయక ఫ్రెండ్ సర్కిల్ ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సాయిశరత్, భాను, లోకేష్, కిరణ్, సుధాకర్, మనోజ్ పాల్గొన్నారు. కొవెవరంలో ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రవికిషోర్, కన్నయ్య, శ్రీకృష్ణ, పానకాలు, పాల్గొన్నారు. బాలాజీరావుపేటలో జై గణేష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని పట్టణంలో ఘనంగా ఊరేగించారు. తూర్పు కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. అల్లం బ్రదర్స్, చల్లా బ్రదర్స్, వెంకట్రావు, అక్బర్‌లు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొలువుదీరిన గణనాధుల నిమజ్జనాలు శుక్రవారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో కోలాహల వాతావరణంలో జరిగాయి. పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన గణనాధులను ప్రత్యేక పూజలు అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి వాహనాలపై ప్రతిష్ఠించి ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. పట్టణంలోని తెలగపాలెం, నిడుబ్రోలు రైలు పేట మండల పరిదిలోని మునిపల్లె, బ్రహ్మణకోడూరు, ఉప్పరపాలెం తదితర గ్రామాలతో పాటు చేబ్రోలు మండలంలోని నారాకోడూరు గ్రామంలో తారకరామా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. గణనాధుల నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ డప్పు వాయిద్యాలు, కోలాటాల ప్రదర్శన నడుమ గణనాధుల నిమజ్జన ఊరేగింపు జరిగాయి.



నారాకోడూరు నుంచి నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

● పొన్నూరు టౌన్: మండల పరిధిలోని చింతలపూడి విఘ్నేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం నిర్వహించిన భక్తి పాటల విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కాకుమాను మండలం కోతివారిపాలెం గ్రామానికి చెందిన భజన సమాజం ఆధ్వర్యంలో భక్తి పాటల విభావరి జరిగింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.



కొల్లిపరలో గణనాథుని ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, వరికూటి అశోక్‌బాబు

● కొల్లిపర: కొల్లిపర మండలంలో గత మూడు రోజులుగా వినాయకచవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు, దావులూరు, చక్రాయపాలెం, అత్తోట తదితర గ్రామాల్లో శ్రీ గణనాధునికి అంగరంగ వైభవంగా భక్తులు పూజలు చేశారు. పండితులు దంపతులు చేత పూజలు చేయించి వినాయకచవితి విశిష్టతను గురించి తెలియజేశారు. మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైసీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వరికూటి అశోక్ బాబు వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపులో పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని అత్తోట, అత్తోటయాదవపాలెం, తూములూరు, అన్నవరంగౌడపాలెం, దావులూరు గ్రామాల్లో కొంత మంది భక్తులు వినాయకుని విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఉంచి గ్రామాల్లో కనక తప్పెట్లు, బాణా సంచా కాల్చుతూ గ్రామపుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, నాయకులు చెంచల రామిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, జొన్నల శివారెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఈదా హర్షవర్ధన్‌రెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి, పిల్లి గంగాధర్, మోర్ల శ్రీను, వంగా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగుభాషలో నైపుణ్యం అవసరం

జేఎంఏ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత



రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాతృభాష తెలుగుభాషను మరిచిపోకుండా ప్రతి తరం నైపుణ్యం సాధించాలని జేఎంఏ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంగ్ల భాష అవసరం నేపథ్యంలో తెలుగు భాషను మరిచిపోకూడదన్నారు. మాతృభాష వస్తేనే అన్ని భాషల్లో సబ్జెక్టు తేలికగా అర్థమవుతుందన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలు శిరీష, వింధ్య, స్వరూపలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌లీన్, విజయలక్ష్మి, మేరికుమారి, హేమలత, నాగచందన, నిర్మల పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్యవేత్త రంగిశెట్టి రమేష్ అధ్యక్షతన అభ్యుదయ కళాసమితి విశ్వసాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గిడుగు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. బొల్లిముంత కృష్ణ, బెల్లంకొండ వెంకట్, యోహాను, సుభాష్‌చంద్రబోస్, శ్రీదేవి, రఘునాధరావులు ప్రసంగించారు. ఉపాధ్యాయుని కె.దేవికారాణి రచించిన స్వప్నవేణి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

● పొన్నూరు టౌన్: మాతృభాష, భూమిని మరువరాదని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి అన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం నిర్వహించి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, తెలుగు పండిట్ రాచకొండ విజయ్ కుమారి, శంకర్రావు, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో వెలువరించాలి

తెనాలి అర్బన్: ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో వెలువరించాలని విశ్రాంత సహకార బ్యాంక్ అధికారి డీ సుబ్రహ్మణేశ్వరరావు కోరారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు సాయి లక్కరాజు అధ్యక్షతన గంగానమ్మపేట టీఎస్ఆర్ హైస్కూల్లో శుక్రవారం బాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగు భాషను ప్రతి ఆంధ్రుడు నేర్చుకునేలా తప్పనిసరి చేయాలన్నారు. సచివాలయంలో భాషా వికాసానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు వెలగా సుబాష్ చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావు, హేమంత్, చక్రవర్తి, హనుమ పాల్గొన్నారు.

జేఎంజే కళాశాలలో క్రీడా దినోత్సవం

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళా కళాశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారాణి ఘట్టమనేని సాయిరేవతి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీందర్‌లను సన్మానించారు. అధ్యాపకురాలు అరుణ సుజాత, వైస్ ప్రిన్సిపల్ రోజ్‌లీన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం నంబూరు విజయభాస్కర్ నగర్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ సమావేశం కే రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ చాలీచాలని జీతాలు తీసుకునే అంగన్వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో పావని, ఎస్.ఇందువాణి, టి.వరకుమారి, పీ కనకవల్లి, సీ అంజనాదేవి, కే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొంటున్న అధికారులు

మురుగునీరు వ్యర్థాలే దోమల వ్యాప్తికి కారణం

● జిల్లా మలేరియా అధికారి టీఎం సుబ్బరాయణం

తెనాలి క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని నిరోధించవచ్చునని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం తెలిపారు. డ్రై డే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గంగానమ్మపేట ప్రకాష్ నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యర్థాలు, మురుగునీరు, నీటటి పారుదల లేకపోవడం అపరిశుభ్రత వంటి కారణాల వల్ల దోమలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. డాక్టర్ దేవరపల్లి సుబాష్ రమాదేవి మాట్లాడుతూ దోమలు ఎక్కువగా ఉండే అపరిశుభ్రత ప్రాంతాల్లో నివశించే వారిలో మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గునియా, మెదడు వాపు వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉందన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి దోమల నివారణకు ఇంటా, బయట పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా శాఖ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, అందే బాలచంద్రమౌళి, వంగల పున్నారెడ్డి, ఎస్.గణేష్, జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఈ కేవైసీ చేయించుకోవాలి

● ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాకేష్ మహాన

చేబ్రోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా తమకు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాకేష్ మహాన అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడి కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారుల ఈ కేవైసీ కార్యక్రమం పై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహాన మాట్లాడుతూ, ఈ కేవైసీ వలన ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలను అర్హులు అవుతారని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు నగదు ఈ కేవైసీ వలన నేరుగా ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని సూచించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ కార్తీక్, మేనేజర్ మహిపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు అధికారుల సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భర్త చిత్రహింసలపై ఫిర్యాదు

తెనాలి క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెళ్ళైన ఏడు నెలలకే తన భర్త మద్యం సేవించి చిత్రహింసలకు గురి చేస్తున్నాడని వివాహిత తెనాలి రూరల్ పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖాజీపేటకు చెందిన ఉమ్మలనేని ఉమాదేవి తనకు ఏడు నెలల క్రితం వివాహం అయ్యిందని తన భర్త వెంకటేశ్వరరావు ఈ మధ్య కాలం నుంచి మద్యం సేవించి తరచూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేసింది.

విద్యార్థుల క్రీడానైపుణ్యాలు అభినందనీయం: ఆర్జేడీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు హ్యాండ్ బాల్ పోటీలలో అత్యుత్తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించి రాష్ట్ర జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయమని విద్యాశాఖ ఆర్జేడీ బీ లింగేశ్వర్ రెడ్డి అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులకు శుక్రవారం ఆయన స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బీ వెంకటేశ్వరరావు, ఎన్ ఉమామహేశ్వరి, పీ అనిల్ కుమారి విద్యార్థులకు హ్యాండ్ బాల్ పోటీలలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర జట్టు తరపున జాతీయ పోటీలలో ప్రతిభ కనపరిచేలా తీర్చిదిద్దారు. జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఈ అవార్డును అందజేశారు. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మహబూబ్ బాషా, కరీంనగర్ చౌదరి, రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎం రవి, ఎస్జీఎఫ్ సెక్రటరీ కొండయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.